నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 ఖమ్మం, మంగళవారం 17 జూన్ 2025 KHAMMAM

## 'మెచ్చా'కు బర్త్‌డే విషెస్ చెప్పిన కేటీఆర్

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం తనను కలిసిన అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.
– దమ్మపేట, జూన్ 16



## హెడ్డాఫీసులో బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ (పా)

కొత్తగూడెం సింగరేణి, జూన్ 16 : సింగరేణి సంస్థలో డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్(పా)గా నియమితులైన గౌతమ్ పోట్రు కొత్తగూడెం హెడ్డాఫీస్‌లోని తన చాంబర్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జీఎంలు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు డైరెక్టర్ (పా)ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో జీఎం పర్సనల్ కవితానాయుడు, బెనెడిక్ట్ నికోలస్, జీవీ కిరణ్‌కుమార్, ఏజీఎం మురళీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్(పా)కు అభినందనలు తెలుపుతున్న అధికారులు

# కేటీఆర్‌ను విచారించడమంటే..
# ప్రశ్నించే గొంతును నొక్కడమే..

- హైదరాబాద్ తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతల స్పష్టీకరణ
- ఏసీబీ విచారణకు వెళ్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసి సంపూర్ణ సంఘీభావం
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన నేతపై సర్కారు కక్షసాధిస్తోందంటూ ఆగ్రహం
- పార్టీ నేతకు మద్దతు తెలిపేందుకు వందలాదిగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి సంఘీభావం తెలుపుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్‌లోని ఎంపీ వద్దిరాజు నివాసం వద్ద బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు



కేటీఆర్‌కు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

'ఫార్ములా–ఈ కార్ రేస్' అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులో రెండోసారి సోమవారం ఏసీబీ విచారణకు హాజరవుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ శ్రేణులన్నీ అండగా నిలిచాయి. నైతిక స్థైర్యాన్ని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరాగా.. ఉమ్మం ఖమ్మం జిల్లా నుంచి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందల సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలోనూ, పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌లోనూ కేటీఆర్‌ను కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన తమ నేతపై రేవంత్ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తూ కక్షసాధిస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు పెట్టి తమ నేత కేటీఆర్‌ను విచారించడమంటే ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న



ఇల్లెందు: హైదరాబాద్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు

గొంతును నొక్కివేయడమేనని అన్నారు. తమ నేతపై ఎంతటి నిందలు మోపినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెరవబోమని తేల్చిచెప్పారు. తమ నేతకు సంపూర్ణ సంఘీభావం ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల మద్దతుతో ఎదిగిన నాయకులను ఇలాంటి తప్పుడు కేసులు ఏమీ చేయలేవని తేల్చిచెప్పారు.

### ఉమ్మడి జిల్లా నుంచి భారీగా..

ఏసీబీ విచారణకు హాజరవుతున్న కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతును తెలియజేసేందుకు; ఆయనకు అండగా నిలిచేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు వందల సంఖ్యలో సోమవారం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ కేటీఆర్‌ను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం జడ్పీ, డీసీసీబీ, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, దిండిగాల రాజేందర్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఇతర నేతలు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, వలరాజు, జ్యోతిరెడ్డి తదితరులు ఉన్నారు.

**వద్దిరాజు ఇంట్లో శ్రేణులకు భోజనాలు..**

కేటీఆర్‌కు మద్దతు తెలిపేందుకు రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బంజారాహిల్స్‌లోని తన నివాసంలో భోజనం ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్‌కు, ఏసీబీ డైరెక్టరేట్‌కు దగ్గరలోనే వద్దిరాజు ఇల్లు ఉండడంతో శ్రేణులందరినీ తన ఇంటికి ఆహ్వానించి భోజనం సిద్ధం చేశారు.

–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 16



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో లింగాల కమల్‌రాజు



కేటీఆర్‌కు మద్దతు తెలిపేందుకు అజయ్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు చేరుకున్న ఖమ్మం నియోజకవర్గ నేతలు



భద్రాచలం: హైదరాబాద్ తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

## ఓసీ పనులు చేపట్టొద్దు..

పూసపల్లి నూతన ఓసీ పనులను అడ్డుకున్న అఖిలపక్ష నాయకులు, బాధితులు



పూసపల్లిలో ఓసీ పనులను అడ్డుకుంటున్న అఖిలపక్ష నాయకులు

ఇల్లెందు రూరల్, జూన్ 16: ఇండ్లు కోల్పోయిన తమకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, ఓసీ ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం నాయకులు, బాధితులు ఇల్లెందు మండలం పూసపల్లి గ్రామంలో నూతన ఓసీ విస్తరణ పనులను సోమవారం అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఎస్‌వో టూ జీఎం రామస్వామి, ప్రాజెక్టు అధికారి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఇల్లెందు ఎస్సై హసీనా, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, భారీ స్థాయిలో పోలీసులను మోహరించినా పట్టువిడవకుండా డోజర్‌కు ఎదురుగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు, పలువురు బాధితులు మాట్లాడుతూ ఓసీ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, సింగరేణి క్వార్టర్లలో నివసిస్తున్న వారికే క్వార్టర్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఓసీ ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇండ్లు సింగరేణి సంస్థ ద్వారానే చేపట్టాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని హెచ్చరించారు. దీంతో చేసేది లేక సింగరేణి, పోలీసు, రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, బాధితులు అబ్దుల్ నబి, పూనెం సురేందర్, మంచాల వెంకటేశ్వర్లు, వెన్నంపల్లి శ్రీనివాస్, హరికృష్ణ, ధనసరి రాజు, తాండ్ర నాగరాజు, సదరం మహేశ్, చాందావత్ రమేశ్, గుళ్ల మొగిలి, గుళ్ల నర్సయ్య, లాలు, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లపై సమీక్షలో ఖమ్మం లెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, జూన్ 16: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లపై అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతీ మండలం, గ్రామానికి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య ప్రకారం.. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన జాబితాను మరోసారి ధ్రువీకరణ చేసి ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రొసీడింగ్స్ పంపిణీ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇండ్లపై నివేదిక అందించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇండ్లు చేరాలని, గతంలో కేటాయించని వాటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కమిటీ నుంచి జాబితా తీసుకొని అధికారులు వెరిఫై చేసిన తర్వాత లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనుల పూర్తి కోసం అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ పైలట్ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 500లకు పైగా గ్రౌండింగ్ చేశామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబు, ఆర్డీవోలు జి.నరసింహారావు, ఎల్.రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

- చర్చనీయాంశంగా.. ఖమ్మం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పోస్టు వ్యవహారం
- ఖమ్మం ఏఎంవోగా రిలీవై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి 16 రోజులుగా నో పోస్టింగ్
- కానీ మంత్రి సిఫార్సు లేఖతో మరో హెచ్ఎం కోసం ఆగమేఘాల మీద కదులుతున్న ఫైల్

ఖమ్మం అర్బన్, జూన్ 16: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో కీలకపాత్ర వహించే అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) పోస్టు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గత మూడేళ్లుగా ఈ పోస్టులో కొనసాగుతున్న కే.రవికుమార్ తాను ఇక ఈ పోస్టులో కొనసాగలేనంటూ ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈ మేరకు ఆయనను ఆ పోస్టు నుంచి రిలీవ్ చేస్తూ రాష్ట్ర అధికారులు గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పుడు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నందున ఆ శిక్షణలు పూర్తయ్యాక గత నెల చివరి రోజున ఆయనను ఆ పోస్టు నుంచి డీఈవో రిలీవ్ చేశారు. దీంతో ఆయన వెంటనే వరంగల్ వెళ్లి ఆర్జేడీ వద్ద రిపోర్ట్ చేశారు. ఆ తరువాత నిబంధనల మేరకు ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ గత 16 రోజులుగా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. నిబంధనల మేరకు ఆయనకు ఇవ్వాల్సిన ప్రదేశం కంటే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలో అనేది తెల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నారు. ఫలితంగా నేటికీ రవికుమార్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు. ఒకవైపు అత్యంత ప్రాధాన్యమైన బడిబాట కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతుండగా.. హైస్కూల్ హెచ్ఎం కేడర్‌లో ఉన్న రవికుమార్‌కు పోస్టింగ్ ఇవ్వకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.

**అక్కడ అలా..**

జిల్లాలో ఏఎంవోగా రవికుమార్ రిలీవ్ కాగానే.. సీఎంవోగా పనిచేస్తున్న యలగందుల రాజశేఖర్‌కు ఏఎంవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన గతంలోనూ ఈ రెండు పోస్టులు సమర్థవంతంగా నిర్వహించడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ఖమ్మం డీఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ ఇలా ఉండగా వైరా మండలానికి చెందిన ఒక హైస్కూల్ హెచ్ఎం ఏఎంవోగా రావాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ పోస్టుకు రావాలంటే రాష్ట్రస్థాయిలో నిర్వహించే రాత పరీక్షలో మెరిట్ కలిగి ఉండాలి. అయితే, గతంలో నిర్వహించిన రాత పరీక్షలో ఎవరూ ఉత్తీర్ణులు కాకపోవడం గమనార్హం. భద్రాద్రి జిల్లాలో ఏఎంవోగా పనిచేస్తున్న నాగరాజశేఖర్ గతంలో ఖమ్మం జిల్లా ఏఎంవో పోస్టుకు పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారు. కానీ నిబంధనల మేరకు ఇది జిల్లాస్థాయి పోస్టు కావడంతోపాటు అదే జిల్లాకు చెందిన వారే పరీక్ష రాయడానికి అర్హులు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఖమ్మం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నాగరాజశేఖర్‌ను అతడి అభిప్రాయం కోరింది. అయితే, తాను భద్రాద్రి జిల్లాలోనే కొనసాగుతానని అతడు రాత పూర్వకంగా సమాధానమిచ్చాడు. అయితే, పక్క జిల్లా వారిని పొరుగు జిల్లా ఏఎంవో పోస్టు నియామక పరీక్షకు ఎలా అనుమతించారనే ప్రశ్నపై చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఏఎంవో పోస్టు ఖాళీగా ఉన్నందున తనకు అవకాశం ఇవ్వాలంటూ వైరా మండలానికి చెందిన సదరు హెచ్ఎం జిల్లాకు చెందిన ఒక మంత్రి సిఫార్సు లేఖతో రంగంలోకి దిగారు. దీంతో అతడి నియామకం కోసం సదరు ఫైల్‌ను విద్యాశాఖ వర్గాలు ఆగమేఘాలపై సిద్ధం చేశాయి. అంతేగాక రాష్ట్రస్థాయి నుంచి కూడా ఫైల్ త్వరగా పంపాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో డీఈవో కార్యాలయం అతడి నియామకం కోసం ఫైల్‌ను తక్షణమే రాష్ట్ర కార్యాలయానికి పంపింది. ఒకే విద్యాశాఖలో ఒక హెచ్ఎంకు 16 రోజులుగా పోస్టింగ్ ఇవ్వకుండా నత్తతో పోటీపడి పనిచేస్తున్న వ్యవస్థ.. మరో హెచ్ఎం విషయంలో మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా ఉరుకులు పరుగులు పెడుతుండడం గమనార్హం. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మధ్య ఆసక్తికర సంభాషణలు చోటుచేసుకుంటున్నాయి.

*కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవసాయ శాఖాధికారులు చేపట్టిన ఫార్మర్ ఐడీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఓటీపీ సమస్యతో అటు అధికారులు, ఇటు రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఎయిర్‌టెల్ సిమ్‌కార్డు ఉన్న రైతులకు మాత్రమే రెండో ఓటీపీ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేక ఏఈవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫార్మర్ ఐడీ ఉంటేనే కేంద్ర ప్రభుత్వం అమలుచేసే వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. ఈ విషయంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతుల నుంచి ఆశించిన మేర స్పందన లభించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 21.44 శాతం మాత్రమే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యింది. ఇందులో ఖమ్మం జిల్లా 39.93 శాతంతో మొదటిస్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 2.55 శాతంతో చివరి స్థానంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 29.92 శాతంతో 7వ స్థానంలో నిలిచింది.*
*– అశ్వారావుపేట, జూన్ 16*

## ఫార్మర్ ఐడీకి.. ఓటీపీ ప్రాబ్లం



- ఎయిర్‌టెల్ నెంబర్లకు రాని రెండో ఓటీపీ
- ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు, రైతులు
- జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు జారీ చేసిన ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు కూడా 11 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు జారీ చేసేందుకు నిర్ణయించింది. ఇందుకు గాను రైతులు, భూముల వివరాలతో కూడిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ బాధ్యతలను వ్యవసాయ శాఖకు అప్పగించింది. వ్యవసాయాధికారులు ఈ ప్రక్రియను మే 5వ తేదీన ప్రారంభించారు.. కానీ.. ఆశించిన స్థాయిలో రైతుల నుంచి స్పందన కనిపించడం లేదు.



ఫార్మర్ ఐడీ కోసం భూమి వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

**వేధిస్తున్న ఓటీపీ సమస్య..**

కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకంతోపాటు ఇతర కేంద్ర వ్యవసాయ పథకాలకు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే ప్రధాన సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే పీఎం కిసాన్ సమ్మాన్ కింద ఒక్కో రైతుకు రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నది. రైతు పథకాల్లో ఎటువంటి అక్రమాలకు చోటులేకుండా నేరుగా రైతులకే అందేలా ఫార్మర్ ఐడీ అందించాలని నిర్ణయించింది. రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడానికి అతడికి సంబంధించిన మొబైల్‌కు ఓటీపీలు వస్తాయి. యాప్‌లోకి ప్రవేశించేందుకు ఒక ఓటీపీ వస్తుంది. రైతు పాస్‌బుక్ నిర్ధారణకు రెండో ఓటీపీ రావాల్సి ఉంటుంది. ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతోంది. ఎయిర్‌టెల్ వినియోగదారులకు మాత్రం రెండో ఓటీపీ సమస్య తలెత్తుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఫార్మర్ ఐడీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రైతులు, అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో..**

| జిల్లా పేరు | మొత్తం పాస్ పుస్తకాలు | రిజిస్ట్రేషన్ పూర్తి | నమోదు శాతం | ఫార్మర్ ఐడీ జనరేటెడ్ |
|---|---|---|---|---|
| ఖమ్మం జిల్లా | 3,40,072 | 1,35,794 | 39.93 | 1,32,238 |
| కొత్తగూడెం జిల్లా | 1,22,732 | 36,727 | 29.92 | 34,829 |

### సాంకేతిక సమస్యతో ఆలస్యం



సాంకేతిక సమస్య వల్ల రైతు నమోదు ప్రక్రియలో ఆలస్యం జరుగుతోంది. దీనికితోడు రైతుల నుంచి ఆశించిన స్పందన లేదు. ఎయిర్‌టెల్ సిమ్ వినియోగించే రైతులకు రెండో ఓటీపీ రావడం లేదు. ఏఈవోలు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
**– రవికుమార్, ఏడీఏ, అశ్వారావుపేట**

**సాంకేతిక సమస్య..**

రైతు నమోదు ప్రక్రియను అధికారులు మే 5వ తేదీన ప్రారంభించారు. సుమారు 40 రోజులకు పైగా అవుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అధికారులు లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నారు. ఇందుకు సాంకేతిక సమస్య ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో ఓటీపీ సమస్య ఉంటే.. మరికొన్ని ప్రాంతాల్లో అసలు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. దీనివల్ల ప్రక్రియ చాలా ఆలస్యమవుతోంది. ఈ నెల 9వ తేదీ నాటికి అధికారిక లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో 39.93 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 29.92 శాతం ప్రక్రియ పూర్తయ్యింది. వారం రోజులకు ఒకసారి నమోదు ప్రక్రియ అప్‌డేట్ అవుతోంది.